క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వ భారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. నరాల, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పంటల పరిశీలన



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లి, ఇప్పపెంట గ్రామాలలో గురువారం సాయంత్రం వీచిన పెనుగాలులకు అరటి, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు శనివారం పెనుగాలులకు దెబ్బతిన్న తోటలను పరిశీలించారు. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించామని క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారులు పరిశీలించి తుది నివేదికను సమర్పిస్తారని తెలిపారు. పరిశీలనలో చింతకొమ్మదిన్నె మండల వ్యవసాయ అధికారి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కులను తనిఖీ చేసిన కమిషనర్



పక్షుల కోసం ప్లాస్టిక్ గోళంలో నీటిని నింపుతున్న కమిషనర్

పులివెందుల టౌన్ : పట్టణంలోని గరండాల్ రివర్ ఫ్రంట్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మెమోరియల్ పార్కులను శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ రాముడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పార్కులలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పక్షులు నీటిని తాగేందుకు ప్రత్యే ప్లాస్టిక్ గోళాలు ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్క లకు నీళ్లు పడుతూ మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకుందాం



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

జమ్మలమడుగు : సమాజంలో ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని రమేష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లోని స్కానింగ్‌ను కడుపులో ఉన్న పిల్లలు ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించాలే తప్ప లింగ నిర్ధారణ చేయడం సరైంది కాదన్నారు. పట్టణంలోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఉద్యాన శాఖ ప్రోత్సాహం

సింహాద్రిపురం : చీనీ రైతులకు, చిన్న, సన్నకారు రైతులకు ఉద్యాన శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ కన్వెర్జెన్సీ కింద 5 ఎకరాలలోపు రైతులకు మూడేళ్ల మెయింటెన్స్ కింద రూ.1,37,700ల చొప్పున ప్రభుత్వం రాయితీ ఇచ్చి ప్రోత్సాహకం ఇస్తుందని ముద్దనూరు హెచ్‌ఓ మల్లేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే 5 ఎకరాలు, పెద్ద కారు రైతులకు ఉద్యాన శాఖ కింద ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన నాగేళ్ల ఈశ్వర్‌రెడ్డి మృతి



వేముల : మండలంలోని పెండ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేళ్ల ఈశ్వర్ రెడ్డి శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన రోడ్డు ప్రమాదంలో గాయపడి కడపలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా రాజకీయాల్లో కొనసాగారు.

పత్తిలో కలుపు నివారణ



పత్తి పంటలో కలుపు నివారణకు సేద్యం చేస్తున్న రైతు

వేముల : వేసవి పంటగా సాగు చేసిన పత్తి పంటలో కలుపు తీసే సేద్యం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మార్చి, ఏప్రిల్ మాసాలలో వేసవి పంటగా పత్తి పంటను విస్తారంగా సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయ బోరు, బావుల కింద పత్తి పంట సాగైంది. సాగు చేసి నెల రోజులు దాటిపోతుండటంతో పత్తిలో కలుపుతీసే పనులను రైతులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ముందుగా పత్తి సాళ్లలో గడ్డి నివారణకు ఎద్దులతో గుంటక తోలే పనులు సాగుతున్నాయి. ఇప్పటికే రెండు, మూడు పదును వర్షాలు పడటంతో పంటలో కలుపు మొక్కలు పెరిగిపోయాయి. ఒకవైపు ఉపాధి పనులు ఉండటంతో వ్యవసాయ పనులకు కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కలుపు ఎక్కువగా ఉండటంతో పంట ఏపుగా పెరగడంలేదు. దీంతో రైతులు కూలీలు, సేద్యాలతో పంటలో కలుపు మొక్కలను తీసి వేస్తున్నారు. పదును వర్షాలు పడటంతో పత్తిలో కలుపు ఎక్కువగా ఉండటంతో కూలీలకు డిమాండ్ పెరిగిందని రైతులు అంటున్నారు. పత్తి సాళ్లలో గుంటక పాతేందుకు ఎకరాకు రూ.700లు ఇస్తున్నామని, చెట్ల కింద ఉన్న కలుపును తీసేందుకు కూలీల ఖర్చు మరో రూ.1000లు అవుతోందని రైతులు చెబుతున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు..



క్రేన్ సహాయంతో విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

లింగాల : మండలంలో విద్యుత్ తీగలు తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి గాలులు వచ్చినా, తుంపెర చినుకులు పడినా విద్యుత్ సరఫరా ఆగిపోతోంది. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లేక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. సిబ్బంది ఉన్నా సరైన మెయింటెన్స్ లేక విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని, ప్రస్తుతం అరటి మొక్కలు నాటే సీజన్ కావడంతో అరటి మొక్కలకు నీరు లేక దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు తగిన చర్యలు తీసుకుని నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా రాత్రివేళల్లో చిన్నపాటి గాలులు వీచినా గృహావసరాల విద్యుత్‌ను కూడా నిలిపివేస్తున్నారని మండల వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరాను సక్రమంగా విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు శనివారం వ్యవసాయ విద్యుత్ 9 గంటలు పూర్తిగా ఆగిపోయిందని రైతులు వాపోతున్నారు. గత వారం రోజుల క్రితం ప్రత్యేక లైన్ అమర్చేందుకు విద్యుత్ కోతలు విధించారన్నారు. ఇలాగైతే వేసవి కాలంలో పంటలు పండించుకోలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా గంధోత్సవం

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్ షా ఆలంపీర్ స్వామి వారి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వాహకులు గండ్లూరి పెద్దవీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మయ్యశెట్టి నివాసం నుంచి గంధంను ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. గంధం దర్గా చేరుకున్న అనంతరం స్వామి వారి మజార్‌పై ఎక్కించారు. పూల చాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

వల్లూరు (చెన్నూరు) : ఉమ్మడి కడపజిల్లా మైనార్టీ, క్రిస్టియన్ వర్గాలకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందన్నారు. అర్హులు హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9290448452 నెంబరులో సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్



చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

వేంపల్లి : వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో గత రెండు నెలలుగా ఈఓ లేకపోవడంతో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారైందని ఫిర్యాదులు అందడంతో పారిశుద్ధ్యంపై వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం వేంపల్లె గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులపై డీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరు, ఖాజీపేట, నందిమండలం తదితర పంచాయతీల నుంచి 30 మంది పారిశుద్ధ్య సిబ్బందిని తీసుకొచ్చి చెత్తాచెదారాలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి, బాలుర ప్రభుత్వ పాఠశాల, నాలుగు రోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో పనులు చేపట్టడం జరిగిందని, వారం రోజుల్లోపు గ్రామంలో ఎక్కడ కూడా చెత్తా చెదారం లేకుండా చూస్తామన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్యంపై అవగాహన కలిగి ఉండి ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై చెత్తను వేయరాదన్నారు. వేంపల్లెలో నీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యచరణ ప్రణాళికపై సమీక్ష

చింతకొమ్మదిన్నె : దక్షిణ మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం 2025-26 ఖరీఫ్, రబీ పంటకాలకు మే 5, 6 తేదీలలో వ్యవసాయ ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఐదు జిల్లాల వ్యవసాయ పరిశోధన విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొని దక్షిణ మండలంలో చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల గురించి చర్చిస్తారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షత వహిస్తారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దక్షిణ మండల పరిశోధన, విస్తరణ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొని 2025-26 సంవత్సరానికి చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళిక మీద సమీక్ష నిర్వహిస్తారని పలువురు ప్రధాన శాస్త్రవేత్తలు, అధికారులు తెలిపారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవ వేడుకలు



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

లింగాల : స్థానికంగా వెలసిన శ్రీకోదండరామ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణం వేద పండితులు నిర్వహించారు. ఆలయంలో విగ్రహాలకు పాలాభిషేకం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. హిందు సాంప్రదాయ ప్రకారం పుణ్య దంపతులచే శాస్త్రోయుక్తంగా వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. వందలాది మంది మహిళలు, భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలు, రామ భజనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు రామభజనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

వేంపల్లి : జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, జెడ్పీ బాలికల, జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాతుడూ అయా ఉన్నత పాఠశాలల్లో టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టులను బోధించి రాబోయే పరీక్షల కోసం సన్నద్ధం చేస్తారన్నారు. ఈ విద్యార్థుల కోసం పాఠశాలలో మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామని, మండలంలోని ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఈ మూడు పాఠశాలలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

ముద్దనూరు : విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాకాధికారి నాగేశ్వరరావు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించిన పిల్లలు 1వ తరగతిలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా చేరేటందుకు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఈనెల 15వ తేదీలోపల ఆన్‌లైన్‌లో చేసుకోవాలని ఎంఈవో తెలిపారు.

వీరపునాయునిపల్లి : సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబి, స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి ఉచితంగా విద్యను అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి 2 అనిత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నివాస సమీప ప్రాంతాల్లోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం 1వ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈనెల 15వ తేదీలోపు మీ దగ్గరలోని సచివాలయం, అంటర్నెట్ కేంద్రం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం లేదా మీ సేవా సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా పెద్దమ్మతల్లి దేవర ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

సింహాద్రిపురం : పెద్దమ్మతల్లి దేవర ఉత్సవాన్ని సింహాద్రిపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దేవరను పురస్కరించుకుని పెద్దమ్మతల్లి దేవత వద్దకు డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు తెచ్చి ప్రజలు, భక్తులు పూజించారు. దేవర ఉత్సవాలతో ప్రధాన వీధులు కిటకిటలాడాయి. దేవర సందర్భంగా వీధులన్ని విద్యుత్ అలంకరణతో కొత్త అందాన్ని తెచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీవరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈనెల 5వ తేదీన పెద్దరంగాపురం, 6న సియోన్‌పురం, 7న బయమ్మతోట, 8న మిస్సమ్మబంగ్లా, 12న గుంతబజార్, వెంకటాపురం, 13న భాకరాపురం, ప్రశాంతినగర్, 14న నగరిగుట్ట, అంకాలమ్మపేట, 15న రాజీవ్‌కాలనీ, పెద్దకొండప్ప కాలనీ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులలో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్, డాక్యుమెంట్ల అప్‌డేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చింతకొమ్మదిన్నె : మే 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు, అనంతరం 12 నుంచి 15వ తేదీవరకు చింతకొమ్మదిన్నె గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం నిర్వహించబడుతుందని ఎంపీడీఓ కుళ్లాయిబాబు తెలిపారు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ అప్లికేషన్ నమోదు చేసేందుకు, వెరిఫికేషన్ సహాయకురాలుగా మహిళా పోలీసు విధులు నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

నేలకొరిగిన మామిడి చెట్లు



చక్రాయపేట : మండలంలో శుక్రవారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు మామిడి, నిమ్మ కాయలు భారీగా నేల రాలడంతోపాటు కొన్ని చోట్ల చెట్లు కూలి పోయాయి. మండలంలోని మహదేవపల్లె, నెరుసుపల్లె, గంగారపువాండ్లపల్లె, సురభి గ్రామాల్లో ఈపరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు పడక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతులు చెట్లను, పంటలను కాపాడు కునేందుకు ట్యాంకర్లతో నీళ్లు పట్టి కాపాడుకుంటు వస్తున్నారు. గాలులు వీచి పంట నేల రాలడం చెట్లు విరిగి పడటంతో నష్టాలకు గురై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొందని నేడు ఆపరిస్థితి లేదని మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు తాటిగొట్ల శివప్రసాదరెడ్డిలు తెలిపారు. ప్రస్తుతం మామిడి రైతులు ఇన్సూరెన్స్ కోసం ప్రభుత్వానికి డబ్బు కూడా కట్టారని వారు తెలిపారు. నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

స్వార్థం కోసమే రాజధాని నిర్మాణం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : చంద్రబాబు తన స్వార్థం, స్వలాభం, సొంత కమ్యూనిటీ కోసమే అమరావతి నిర్మిస్తున్నారని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దొందూ దొందేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతి పునఃప్రారంభ కార్యక్రమం అంతా మోదీ, చంద్రబాబు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడమే సరిపోయిందన్నారు. రాష్ట్రానికి కావాల్సిన నిధులను అడగడంలో చంద్రబాబు వైఫల్యం చెందారని, అలాగే ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వకుండా ప్రధాని మోదీ మరో సారి మోసం చేశారని ధ్వజమెత్తారు. కేవలం చంద్రబాబు తన స్వార్థం, స్వలాభం, సొంత కమ్యూనిటీ కోసమే ఈ రాజధాని నిర్మాణం చేపడుతున్నారని మండి పడ్డారు. 2014లో తట్టెడు మట్టి, చెంబుడు నీళ్ల ఇచ్చిన మోదీ ఈ సారి అవి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. మహానగరం అని చంద్రబాబు పదే పదే సంబర పడిపోతున్నారని, అవి నిర్మిస్తే వచ్చేవి కావన్నారు. ఒక్క కేంద్ర పరిశ్రమ కూడా లేకుండా మహానగరం ఎలా రూపుదిద్దు కుంటుందని ఆయన ప్రశ్నించారు. బీజేపీకి రాష్ట్రంపై ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టే అర్థం అవుతుందన్నారు. తెలంగాణలో కేవలం రూ.668 కోట్లతో 28 ఏకరాల్లో సచివాలయం నిర్మించారని, ఢిల్లీలో రూ.980 కోట్లతో పార్లమెంటు భవనం నిర్మిస్తే అమరావతి నిర్మాణానికి రూ.4600 కోట్లు అవసరమా? అని ఘాటుగా ప్రశ్నించారు. 99 శాతం జిల్లా స్థాయిలోనే పనులు ఉంటే ఒక్క శాతం పనుల కోసం వెళ్లే సచివాలయం కోసం ఇంత బడ్జెట్ వెచ్చించవచ్చా అని అన్నారు. ప్రత్యేక హోదా ఇస్తేనే పరిశ్రమలు వస్తాయని, అవి రాకపోతే సంపద సృష్టి ఎలా జరుగు తుందన్నారు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల అమలు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని గాలికొదిలేసి అమరావతి అనే కొత్త పల్లవి అందుకున్నారని మండి పడ్డారు. ఏడాది కావస్తున్నా జీతాలు, పెన్షన్లు తప్పా ప్రజలకు ఏమీ చేశారన్నారు. కూటమి నాయకులకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు తొందరలోనే ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, జగన్‌మోహన్‌రెడ్డి, దేవదానం, రామసుబ్బారెడ్డి, గండి భాస్కర్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

గండి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



గండి అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆశీస్సుల కోసం శనివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. శనివారంతో పాటు సెలవులు ఉండటంతో భక్తులు తరళి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.